


కొకైన్ (ఫైల్ ఫోటో)

శ్రీభరతే...

విశాఖ లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ అధిష్ఠానం

- పార్టీ శ్రేణుల్లో వెల్లివిరిసిన ఉత్సాహం
- రెండోసారి బరిలోకి...
- పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట అసెంబ్లీ అభ్యర్థినిగా కోళ్ల లలితకుమారి
- భీమిలిపై కొనసాగుతున్న ఉత్కంఠ


ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ లోక్‌సభ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా 'గీతం' విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీభరత్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. 'విశాఖపట్నం' కోసం మిత్రపక్షమైన బీజేపీ పట్టుబట్టినా...గత ఎన్నికల్లో అతి స్వల్ప తేడాతో కోల్పోయిన ఈ సీటును వదులుకునేందుకు తెలుగుదేశం అంగీకరించలేదు. విశాఖ పార్లమెంటు స్థానం నుంచి శ్రీభరత్ రెండోసారి బరిలోకి దిగబోతున్నారు.

టీడీపీ సీనియర్ నేత ఎంవీవీఎస్ మూర్తి మరణానంతరం ఆయన వారసునిగా పెద్ద కుమారుడు రామారావు తనయుడు శ్రీభరత్ రాజకీయ ప్రవేశం చేశారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి పోటీ చేసి కేవలం 4,414 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఎన్నికల అనంతరం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఉంటున్నారు. అధిష్ఠానం పిలుపుమేరకు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు గీతం విద్యా సంస్థల చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా శ్రీభరత్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈసారి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. శ్రీభరత్ అమెరికాలోని పర్డ్యూ విశ్వ విద్యాలయం నుంచి ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, స్టాన్ ఫోర్డు వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టాలు అందుకున్నారు. అమెరికాలో చదువు పూర్తయిన తరువాత కుటుంబానికి చెందిన విద్యుత్ రంగ పరిశ్రమల్లో కొంతకాలం పనిచేశారు. ఒడిశాలో జల విద్యుత్, ఏపీలో సౌర విద్యుత్ పరిశ్రమలను నిర్వహించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వేదికగా ఉండే 'టై' ఏపీ చాప్టర్ సభ్యుడిగా, అధ్యక్షుడిగా వ్యవహరించారు. తెలంగాణలో టీ హబ్ తరహాలో గీతంలో వెంచర్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

ఇదిలావుండగా విశాఖ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడింటిలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఒక్కోచోట పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన టీడీపీ శుక్రవారం ఎస్.కోట స్థానానికి ప్రస్తుత ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పేరు ప్రకటించింది. ఇంకా భీమిలి అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- టీడీపీ అభ్యర్థి శ్రీభరత్

నాపై ఎంతో నమ్మకం ఉంచి విశాఖ పార్లమెంటు స్థానానికి అభ్యర్థిగా ప్రకటించినందుకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. అదేవిధంగా బీజేపీ, జనసేన పార్టీ నాయకులకు కూడా కృతజ్ఞతలు. అధిష్ఠానం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. అందరి సహకారంతో విశాఖ అభివృద్ధికి పనిచేస్తా.

సముచిత స్థానం కల్పిస్తాం

- గండి బాబ్జీకి చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ హామీ
- 'సౌత్' ఇన్‌చార్జిగా కొనసాగుతూ జనసేన అభ్యర్థి విజయానికి కృషిచేయాల్సిందిగా సూచన


నారా చంద్రబాబునాయుడుతో గండి బాబ్జీ, వంశీ

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తగిన న్యాయం చేస్తామని విశాఖ దక్షిణ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి గండి బాబ్జీకి ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. బాబ్జీని, ఆయన కుమారుడిని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి తీసుకువెళ్లారు. లోకేశ్‌తో సమావేశం ఏర్పాటుచేశారు. గండి బాబ్జీకి సముచిత స్థానం కల్పించాలని శ్రీభరత్ కోరగా లోకేశ్ సానుకూలంగా స్పందిస్తూ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతానికి విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టాలని సూచించగా... అందుకు బాబ్జీ అంగీకరించారు. అదే సమయంలో విశాఖ దక్షిణ ఇన్‌చార్జిగా వ్యవహరించి వచ్చే ఎన్నికల్లో మిత్రపక్షమైన జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని లోకేశ్ సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు అధిష్ఠానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సాయంత్రం గండి బాబ్జీ, ఆయన కుమారుడు వంశీ ఇద్దరూ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పార్టీని ... మిగతా 6వ పేజీలో

విశాఖ కేంద్రంగా డ్రగ్స్ రవాణా!

విదేశాల నుంచి దిగుమతి

- ఇంటర్‌పోల్ సమాచారంతో బ్రెజిల్ నుంచి వచ్చిన కంటెయినర్‌లో కొకైన్‌ను గుర్తించిన సీబీఐ
- కొనసాగుతున్న దర్యాప్తు
- ఎన్నాళ్ల నుంచి ఈ వ్యవహారం నడుస్తుందో...
- తూతూమంత్రంగా కస్టమ్స్ తనిఖీలు


కంటైనర్ టెర్మినల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా గంజాయి మాత్రమే కాకుండా డ్రగ్స్ కూడా పెద్దఎత్తున రవాణా అవుతున్నాయని తాజా ఘటనతో తేటతెల్లమైంది. తమకేమీ తెలియదని దిగుమతిదారులు చెబుతున్నప్పటికీ...ఎవరికీ తెలియకుండా అంత పెద్ద మొత్తంలో కొకైన్ బ్రెజిల్ నుంచి ఇక్కడి వరకూ ఎలా వస్తుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఎంతోమంది సహకారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇంటర్‌పోల్‌కు సమాచారం అందిందంటే...అనేక దేశాలతో ఈ అక్రమ రవాణా ముడిపడి ఉందని అర్థమవుతోంది. అందుకే సీబీఐ ఈ కేసు విషయంలో ఆగమేఘాలపై స్పందించింది.

ఇంటర్‌పోల్ నుంచి ఈ నెల 18న సమాచారం రాగా సీబీఐ 19వ తేదీన కంటెయినర్ తెరిచి పరీక్షించింది. నార్కోటిక్ డ్రగ్స్ కిట్‌తో నమూనాలు పరిశీలించి కొకైన్ వచ్చిందని నిర్ధారించుకుంది. దీని వెనుక ఎవరెవరి హస్తం ఉందనే విషయాలపై ఆరా తీస్తోంది. అసలు ఎన్నాళ్ల నుంచి ఇలా కంటెయినర్లలో డ్రగ్స్ వస్తున్నాయి?, కేవలం డ్రై ఈస్ట్ పేరుతో వచ్చే కంటెయినర్ల ద్వారానే వస్తున్నాయా?, ఇతర సరకుల కంటెయినర్లలో కూడా తెస్తున్నారా?...అనే అంశాలపై విచారణ చేస్తోంది. బాగా పలుకుబడి, పేరు ఉన్న సంస్థల ద్వారా తెచ్చుకుంటే పెద్దగా తనిఖీలు ఉండవనే ఆలోచనతో సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్స్‌ను ఉపయోగించుకున్నారా?, లేదంటే అందులో వారికీ సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

కస్టమ్స్ తనిఖీలు అంతంత మాత్రం

విశాఖపట్నంలో కంటెయనర్లను కస్టమ్స్ అధికారులు తూతూ మంత్రంగానే తనిఖీలు చేస్తున్నారు. వాస్తవంగా చెప్పాలంటే...సరకు దిగుమతి చేసుకున్న సంస్థ ప్రతినిధులే కంటెయినర్‌ని ఓపెన్ చేసి, శాంపిల్‌ను ప్యాక్ చేసి కస్టమ్స్ అధికారులకు ఇస్తున్నారు. ఇది చాలా అడ్డగోలు వ్యవహారం.

విశాఖపట్నం వచ్చిన ఏ కంటెయినర్ అయినా సరే పోర్టు నుంచి కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్ఎస్)కు చేరుతుంది. విశాఖలో పది సీఎస్ఎఫ్‌లు ఉన్నాయి. అక్కడ కస్టమ్స్ అధికారులు ఉంటారు. అక్కడకు వచ్చిన కంటెయినర్లను తెరిచి, అందులో పేర్కొన్న సరకులే వచ్చాయా? లేదా?...అని తనిఖీ చేసి సర్టిఫై చేయాలి. ప్రతి కంటెయినర్‌ను తెరిచి శాంపిల్ ... మిగతా 6వ పేజీలో

చీరల పంపిణీకి వైసీపీ నేతల యత్నం

- అడ్డుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్...46 చీరలు, 3 లంగా ఓణీలు స్వాధీనం
- జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్‌పై కేసు నమోదు, కారు సీజ్
- అదే వాహన శ్రేణిలో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య


జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ వాహనంలో పట్టుబడిన చీరలు


తనిఖీల సందర్భంగా అక్కడ ఉన్న విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య

చోడవరం, మార్చి 22: ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికార పార్టీ నాయకులు నానా రకాలుగా యత్నిస్తున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఓటర్లకు పంచేందుకు వైసీపీ నేతలు తీసుకువెళుతున్న చీరలను శుక్రవారం ఎలక్షన్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ భార్య ఒక వాహనంలో, జెడ్పీటీసీ సభ్యురాలు మారిశెట్టి విజయ భర్త శ్రీకాంత్, తదితరులు మరో వాహనంలో శుక్రవారం ఉదయం పట్టణంలోని పెదబజారువీధిలో గల ఓ వ్యాపారి ఇంటికి బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి డి.సురేఖ, ఇతర సిబ్బంది...వైసీపీ నేతల వాహనాలను అడ్డుకుని తనిఖీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ కారులో ఉన్న 46 చీరలు, 3 లంగా ఓణీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమ కుటుంబంలో శుభకార్యం కోసం తీసుకువెళుతున్నట్టు వైసీపీ నాయకులు నమ్మించేందుకు యత్నించినప్పటికీ, విచారణలో తేల్చుకోవాలని అధికారులు స్పష్టంచేశారు. అనంతరం వాటిని పోలీసులకు అప్పగించారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు తీసుకువెళుతున్న చీరలను స్వాధీనం చేసుకోవడంతో పాటు శ్రీకాంత్‌కు చెందిన కారును సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే భార్య, ఇతర వైసీపీ నాయకులు ఉన్నప్పటికీ, వారిని వదిలేయడాన్ని విపక్ష నేతలు తప్పుపడుతున్నారు. పట్టపగలే ఓటర్లకు తాయిలాలు పంచేందుకు అధికార పార్టీ నాయకులు బరితెగించడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

టిడ్కో లబ్ధిదారులకు నోటీసులు

- బ్యాంకు రుణం మంజూరు కాదట
- యూనిట్ మొత్తం వ్యయం భరించాలట...

- మూడు రోజుల్లోగా స్పందించకుంటే ఇల్లు కేటాయింపు రద్దు చేస్తామంటూ హెచ్చరిక
- ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు తేదీతో ఇప్పుడు జారీ
- అదీ రోడ్లుపైకి పిలిచి అందజేత
- జీవీఎంసీ అధికారుల తీరుపై ఆందోళన


రోడ్డుపైనే లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత టిడ్కో లబ్ధిదారులకు జీవీఎంసీ సిబ్బంది వెనుకటి తేదీలతో నోటీసులు జారీచేస్తుండడం కలకలం రేపుతోంది. నోటీసుకు మూడు రోజుల్లోగా స్పందించాలని లేనిపక్షంలో ఇల్లు రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నగరంలో నివసిస్తున్న పేదల కోసం గత తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. అర్హత మేరకు లబ్ధిదారులు డిపాజిట్ కింద రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకూ చెల్లించారు. మిగిలిన మొత్తంలో ప్రభుత్వం కొంత సబ్సిడీగా, మరికొంత బ్యాంకు రుణంగా మంజూరుచేస్తుందని అప్పట్లో అధికారులు చెప్పారు. 2019 ఎన్నికల సమయానికి సగానికిపైగా పూర్తయ్యాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని నాలుగేళ్లపాటు గాలికి వదిలేసింది. ఇటీవల కొన్నింటిని పూర్తిచేసి కేటాయింపులు మొదలెట్టింది. ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. అయితే టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులుగా ఎంపికైన పలువురికి బ్యాంకులు రుణం ఇచ్చేందుకు సిద్ధంగా లేవంటూ జీవీఎంసీ అధికారులు కొత్త వాదన తెరపైకి తీసుకువచ్చారు. సిబిల్ స్కోరు లేనందున అనర్హులుగా తేలినట్టు చెప్పుకొస్తున్నారు. అటువంటి లబ్ధిదారులకు ఫైనల్ క్యాన్సిలేషన్ నోటీసులు జారీచేస్తున్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఇప్పుడు నోటీసులు జారీచేయడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ఈనెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున అక్కడకు మూడు రోజులు ముందు అంటే ఈనెల 13వ తేదీతో నోటీసులను రెండు రోజుల నుంచి లబ్ధిదారులకు సిబ్బంది అందజేస్తున్నారు. అయితే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గానీ, జీవీఎంసీ కార్యాలయం/జోనల్ కార్యాలయానికి పిలిచి గానీ నోటీసులు ఇవ్వడం ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.12
సహరి (ఆది)	4.43

ఖాకీ కిరాతకం

- భార్యకు శిరోముండనం చేసిన కానిస్టేబుల్
- ఆపై హత్యాయత్నం
- నిందితుడి అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన కానిస్టేబుల్ భవానీ శంకర్

సీతంపేట, మార్చి 22: భార్య పట్ల అతి కిరాతకంగా ప్రవర్తించాడో కానిస్టేబుల్. శిరోముండనం చేయడంతోపాటు ఆమె కనుబొమ్మలనూ కత్తిరించాడు. ఈ దురాగతానికి పాల్పడిన అనకాపల్లి టౌన్ కానిస్టేబుల్‌ను నగరంలోని నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రైల్వే న్యూకాలనీ ... మిగతా 6వ పేజీలో

కాన్వెంటు కూడలిలో తనిఖీ



ఆటోకు ఉన్న రాజకీయ పోస్టర్ తొలగిస్తున్న పోలీసులు

జ్ఞానాపురం, మార్చి 22: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా కాన్వెంటు కూడలిలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు.ఆటోలు, కారులపై ఉన్న రాజకీయ పోస్టర్లను గుర్తించివాటిని తొలగించారు. వాహనాలపై రాజకీయ సంబంధిత పోస్టర్లను తొలగించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కటౌట్లు తొలగించరా..'



శాంతిపురంలో నిలిచి ఉన్న రథంపై ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ పోస్టర్లు

అక్కయ్యపాలెం, మార్చి 22: ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయకుండా సచివాలయం ఉద్యోగులు, జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ ఆరోపించారు. వార్డు పరిధి శాంతిపురంలోని ఎల్‌టీ పార్కుకు అనుకుని ఉన్న రోడ్డుపై ఉత్తరాంధ్ర ప్రజా పార్టీకి చెందిన ప్రచార రథం పార్కింగ్ చేశారు. దానికి ఉన్న కటౌట్లు తొలగించకుండా అలాగే వదిలేశారన్నారు. అదే ప్రాంతంలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంపై కటౌట్లను తొలగించలేదన్నారు. ఈ విషయాన్ని సచివాలయం ఉద్యోగులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని చెప్పారు. అలాగే, ఎన్‌జీజీఓస్ కాలనీ సమీపాన జై భారత్ పార్టీ కార్యాలయం ఎదుట రోడ్డుపై కటౌట్లు పెట్టారన్నారు. దీనికి సమీపంలో పోలింగ్ బూత్ ఉందని, దాన్ని కూడా ఆ పార్టీ నాయకులు పట్టించుకోలేదని పేర్కొన్నారు.అధికారులుస్పందించి కటౌట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.









కాన్వెంట్ కూడలికి వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనదారుల పాట్లు



రహదారిపై పడిన భారీ గొయ్యి

ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడల్!

- అడుగడుగునా దర్శనమిస్తున్న గోతులు
- అవస్థల మధ్య రాకపోకలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- మరమ్మతులు చేపట్టని అధికారులు

జ్ఞానాపురం, మార్చి 22: ఆ రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. అడుగడుగునా గోతులతో నరకం చూస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. కాన్వెంట్ కూడలి నుంచి రామకృష్ణ జంక్షన్‌కు వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా హార్బర్ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయింది. దీంతో అటువైపు వెళ్లాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా గతుకుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. గతంలో ఈ ప్రాంతానికి ముందు, తరువాత కొత్తగా రహదారి నిర్మించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నా కనీసం గోతులు పూడ్చే ప్రయత్నం చేయలేదు. పూర్ణామార్కెట్, పాత పోస్టాఫీస్‌కు వెళ్లేందుకు ఇది దగ్గరదారి కావడంతో అధికశాతం మంది వాహనదారులు ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. ఈ నేపథ్యంలో వాహనాలు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యను గుర్తించి అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, కొత్తగా లేయర్ వేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులతోపాటు వాహన చోదకులు కోరుతున్నారు.

బ్రిటీష్ కాలం కంటే జగన్ పాలన దారుణం

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

కంచరపాలెం, మార్చి 22 : బ్రిటీష్ కాలంలో పరిపాలన కంటే జగన్మోహన్ రెడ్డి పాలన దారుణంగా ఉందని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఊర్వశి జంక్షన్ అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి శుక్రవారం పార్టీ కార్యాలయాన్ని విష్ణుకుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అవినీతి, భూ కబ్జాలు, దోపిడీలు తప్పా ఎక్కడా అభివృద్ధి జాడలేదన్నారు. ఎవరైనా ఎదురించి ప్రశ్నిస్తే వారిని వేధించడం వైసీపీ పాలకుల నైజంగా మారిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడని ఒక్క అవకాశాన్ని ప్రజలు అందిస్తే రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాడన్నారు. అవినీతి రాజ్యమేలుతోందని, ప్రజలుఎవరికీ భద్రతలేకుండా పోతోందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడక తప్పదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్, పెంటకోట స్రవంతి, రంగుముద్ర రాంబాబు, పొలమరశెట్టి శ్రీను, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే టౌన్‌షిప్ అధినేతకు టికెట్ కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 22: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున చీరాల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు ఆర్‌కే టౌన్‌షిప్ గ్రూప్, ఆర్‌కే ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌ల అధినేత మద్దులూరి మాలకొండయ్యని అధిష్టానం ఖరారు చేసిన సందర్భంగా ఆయనకు ఆర్‌కే టౌన్‌షిప్ విశాఖ, ద్వారకానగర్ శాఖ మేనేజర్లు ఎ.వేణుగోపాల్, బి.అప్పారావు పీఆర్‌వో వెంకట్, వి.జవహర్, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, మార్కెటింగ్ జీఎంలు పి.అప్పలనాయుడు, ఆర్‌కె చౌదరి, జి.రాజేష్‌బాబు, బి.భాస్కరరావు, ఎస్‌పి నాయుడు, కె.కోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది పి.రామారావు, కె.పాపారావు, జి.రమేష్‌బాబు, రామకృష్ణ, డి.ప్రతాప్, మహేశ్, పైడిరాజు, రామచంద్రరావు, డి.సుస్మిత, కె.పంకజ, బి.శ్రీదేవి, కె.సీతామహాలక్ష్మి, సరోజిని, కె.ఆదినారాయణ, రమణారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖను అంతర్జాతీయ డ్రగ్స్ రాజధానిగా మార్చారు

- జనసేన పార్టీ నేతలు



డ్రగ్స్‌పై పోస్టర్‌ని ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

సీతంపేట, మార్చి 22: వైసీపీనేతలు విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా మారుస్తానని చెప్పి దేశానికి గంజాయి, డ్రగ్స్ మూల కేంద్రంగా మార్చేసి పరువుతీశారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనమాట్లాడారు. విశాఖ పోర్టులో సీబీఐ స్వాధీనం చేసుకున్న రూ. 50 వేల కోట్ల విలువైన డ్రగ్స కంటైనర్ అధికార వైసీపీ నేతలదేనని ప్రతిపక్షాలతో పాటు ఆటు సోషల్ మీడియా ఆరోపిస్తుంటే, ఆ పార్టీ నేతలు మాత్రం నోరు విప్పడం లేదన్నారు. డ్రగ్స్ దిగుమతి చేసు కొన్నకూనం వీరభద్రరావు వైసీపీకి చెందిన వ్యక్తి కావడం,డ్రగ్స్ వచ్చిన బ్రెజిల్ దేశాధ్యక్షుడిని కీర్తిస్తూ గతంలో ఆ పార్టీలో నెంబర్ టు అయిన విజయసాయి రెడ్డి ట్విట్టర్‌లో మేసేజ్ పెట్టడం డ్రగ్స్ బంధాన్ని బలపరుస్తోందని ఆరోపించారు. ప్రశాంతతకు మారుపేరైన విశాఖలో రిటైర్మెంట్ అనంతరం ఇక్కడ జీవించాలని చాలా మంది కోరుకుంటారని, అలాంటి నగరంహింస, గంజాయికి నిలయంగా, డ్రగ్స్‌కి నిలయంగా మారడం శోచనీయన్నారు.

డ్రగ్స్ దిగుమతిలో వైసీపీ నేతల హస్తం

ఇటీవల వరకు కేవలం గంజాయి మాత్రమే విశాఖలో దొరుకుఉందని భావించారని, ఇప్పుడు ఇతర దేశాల నుంచి నేరుగా భారీ స్థాయిలో డ్రగ్స రావాణా కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి చేసుకున్నవారు, చేయించినవారు వైసీపీ నేతలేనన్న పోస్టర్లను నాయకులు ప్రదర్శించారు. పోర్టులో డ్రగ్స తనిఖీలను రాష్ట్ర పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేయడం ఆపార్టీ నేతలను రక్షించేందుకే అన్నా రు. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో ఇంకెన్ని కంటైనర్లు దిగుమతి చేశారోనని ఆయన పేర్కొన్నారు. దిగుమతి అయిన 25 వేల కేజీల డ్రగ్స్ ఎన్నికల ముందుదేశంలోకి వెళ్లినట్లయితే, యువత పరిస్థితి ఏమిటనేది భయమేస్తుందన్నారు. కొద్ది రోజుల క్రితం ఎంపీ ఎంవీవీ భార్యపై దాడి జరిగిందని, ఈ రోజు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ సతీమణిని కత్తితో భయపెట్టి పట్టపగలే చోరీ చేటుచేసుకుందటే, నగరంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో తెలుస్తోందన్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన తరువాత విశాఖ పోర్టు, గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టులలో జరిగిన అనుమానాస్పదన రవాణాపై విచారణ జరపాలన్నారు. ఇందులో భాగస్వాములైన వైసీపీ నేతల పేర్లు బయటపెట్టి ఎన్నికలలో వారిని అనర్హులుగా ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎస్. రాజు, పోతు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు

జనసేన సైనికులకు పరామర్శ



కుటుంబాలతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ యాదవ్

జగదాంబ కూడలి, మార్చి 22: దక్షిణ నియోజవర్గంలో ఇటీవల జరిగిన ఘర్షణలో పోలీసు కేసులు నమోదైన జనసేన కార్యకర్తల కుటుంబాలను ఆ పార్టీ నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులతో కలసి కల్లుపాకలు, ప్రసాద్ గార్డెన్స్, కోటవీధి ప్రాంతాలకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలను కలసి వారిని ఓదార్చారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. కేసులో ఇరుకున్న జనసేనికులకు చట్టపరంగా సాయమందిస్తామని కుటుంబ సభ్యులకు హమీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గఫూర్, రామిరెడ్డి తదితరులతో కలసి 35, 39 వార్డులో పర్యటించారు, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

డ్రగ్స్ లభ్యం ఆందోళనకరం: ఏబీవీపీ

అక్కయ్యపాలెం, మార్చి 22: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నగరంలో సీబీఐ అధికారులు భారీ స్థాయిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ అన్నారు. విశాఖ గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు కేంద్రంగా మార్చివిద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఈ డ్రగ్స్ మాఫియా వెనుక ఉన్న రాజకీయ నాయకులను, అధికారులపై సమగ్ర విచారణ జరిపి అరెస్టు చేయాలని, డ్రగ్స్ డెలివరీ నిమిత్తం రిజిస్టర్ అయిన ప్రైవేటు కంపెనీ లైసె న్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానం పెంపొందించేందుకు సదస్సులు దోహదం

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్



జాతీయ స్థాయి సదస్సు ప్రారంభంలో అతిథులు

జ్ఞానాపురం, మార్చి 22: జాతీయ స్థాయి సదస్సులు విజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు దోహదపడతాయని ఏ యూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై రెం డు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును శుక్రవారం ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, స్టీఫెన్, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కె.రామిరెడ్డి దీప ప్రారంభించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించగలిగితే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. మనస్తత్వ, వ్యాపార నిర్వహణ, అభివృద్ధి తదితర అంశాలపై డా.కె.రామిరెడ్డి,ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, కన్వీనర్ డా.డి. రాజ్యలక్ష్మి, డా.ఎన్.జ్యోతి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయుడు గంట్ల శ్రీనుబాబు ఆర్.పావని, డా.జాన్‌పాల్ రాజ్, డా.వి.శ్రీనివాస్, డా.వీరభద్రస్వామి,డాక్టర్ అరుణ, డాక్టర్ సుధ, డా.పీకే జయలక్ష్మి పాల్గొన్నారు.

పశ్చిమ పరిశీలకురాలిగా పేడాడ.రమణికుమారి

మురళీనగర్, మార్చి 22 ; సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ వెస్ట్ నియోజకవర్గ పరిశీలకురాలిగా ఆపార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ.రమణికుమారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ జంక్షన్ హైవే రోడ్డులోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం అభినందన కార్యక్రమం చేపట్టారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఎ.ఆనంద్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఎ స్.ఎ.రహమాన్, ఉమారాణిలనాయకులున్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఆశ్రిత, పృథ్వీరాజ్‌కు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 22: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థులు ఆశ్రిత, పృథ్వీరాజ్ పతకాలు సాధించారు. మీరట్‌లో జరిన ఈ టోర్నీ మహిళల 50 కిలోల విభాగంలో బి.ఆశ్రిత స్వర్ణ పతకం కైవసం చేసుకోగా, పురుషుల 63 కిలోల విభాగంలో కె. పృథ్వీరాజ్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుల్లయ్య కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ శుక్రవారం తన కార్యాలయంలో వీరిద్దరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు

సీతంపేట, మార్చి 22: మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మహిళలపై అనుచిత వ్యాఖ్యాలు చేశారంటూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో వైసీపికి చెందిన మహిళా నాయకులు సీఐ విజయ్‌కుమార్‌కి ఫిర్యాదును అందచేశారు. ఆయనపై చర్యలకు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వైసీపీ టోపీలు!



గొల్ల జగ్గారాజుపేటలో వైసీపీ టోపీలు ధరించిన పాఠశాల పిల్లలు

విశాఖపట్నం, మార్చి 22: వైసీపీ ప్రచారంలో పాఠశాల చిన్నారులను వదలడంలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏకంగా పాఠశాల పిల్లలకు వైసీపీ టోపీలు పం పిణీచేసి నిబంధనలను ఉల్లంఘిస్తోంది. వీటి పంపిణీలో వలంటీర్లు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. వివరాలివి.. గ్రేటర్ 88వ వార్డు గొల్లజగ్గరాజుపేట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద పిల్లలు వైసీపీ టోపీలు ధరించి కనిపించారు. స్థానికులు ఆ చిన్నారుల వద్ద ఆరా తీయగా వలంటీర్లు ఇచ్చినట్టు బదులిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ టోపీలు అడు గుతుండడంతో వాటిని వారు బ్యాగుల్లో పెట్టుకున్నారు. కాగా, అక్కడికి సమీపంలో ఉన్న మరికొన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సైతం వైసీపీ టోపీలు పంపిణీచేసినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఎన్నికల విధులు, ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొన రాదని కోర్టు ఆదేశాలున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా పలు ప్రాంతాల్లో చీరలు, ఇతర వస్తువులు వలంటీర్ల చేతుల మీదుగా పంపిణీ అవుతున్నట్టు పారిశ్రామిక ప్రాంతంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భార్యా, కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం,మార్చి 22 : భార్యా కుమారుడు అదృశ్యంపై కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు నమోదైంది. వివరాలివి.. కంచరపాలెం కప్పరాడ ప్రాంతంలో ఉంటున్న మూల ధర్మారావుకి భార్య రమ (29), ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నకుమారుడు ఫాల్గుణ (15) పుట్టిన రోజుకు కొత్త దుస్తులుకొనుగోలుకు భర్త వద్ద రూ.వెయ్యి తీసుకుని ఈనెల 20న సాయంత్రం రమ కుమారుడితో కలిసి బయటకు వెళ్లారు. అలా వెళ్లిన వారిద్దరు రాత్రయినా,ఇంటికి చేరకపోవడంతో ధర్మారావు, బంధువులు ఇళ్లల్లో, పరిసర ప్రాంతాల్లో వెతికారు. వారి ఆచూకీ లభించకపోవడంతో స్థానిక శుక్రవారం ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెచ్ వై.ప్రకాశరావు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి గన్‌మన్‌కు గాయాలు

విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీచ్‌రోడ్డు ఏరియాలో నివాసం ఉంటున్న ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి వద్ద పనిచేసిన గన్‌మన్ మేడ పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో గాయపడిన అతడిని ఆరిలోవ ఏరియాలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వర్గాలు ఫిర్యాదుచేయడంతో ఆరిలోవ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ వ్యవహారంపై పలు రకాల కథనాలు వినిపిస్తున్నాయి.

49, 50 వార్డుల్లో వైసీపీ ప్రచారం

మాధవధార, మార్చి 22: విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యునిగా తనను గెలిపిస్తే ప్రజలు గర్వ పడేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆ పార్టీ సమన్వకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన49, 50వవార్డుల్లో పర్యటించారు. ఉదయం వాకర్స్‌క్లబ్ సభ్యులతో మాట్లాడారు. వ్యాయామం చేసేందుకు వచ్చిన యువతను తమ ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డుల కార్పొరేటర్లు, సుదర్శన్ పార్కు కమిటీ, మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకి ఓటేసి వైసీపీని గెలిపించాలని అభ్యర్థించారు.

విశాఖ కేంద్రంగా డ్రగ్స్ రవాణా!

... 5వ పేజీ తరువాయి

తీసుకోవాలి. దానిని పరీక్షకు పంపాలి. కానీ విశాఖలో అలా జరగడం లేదు. వంద కంటెయినర్లు వస్తే అందులో నాలుగైదు మాత్రమే కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసి 'అవుట్ ఆఫ్ ఛార్జ్' అని సర్టిఫై చేసేస్తున్నారు. మిగిలిన కంటెయినర్లను ఆయా సంస్థల ప్రతినిధులే తెరిచి..శాంపిల్ తీసి ప్యాకింగ్ చేసి కస్టమ్స్ ఆఫీసులో అందజేస్తున్నారు. ఇదొక్కటే కాకుండా టెర్మినల్ నుంచి కంటెయినర్ బయటకు వచ్చినప్పుడు ప్రభుత్వానికి చెందిన సిపాయి ఒకరు ఉంటారు. సదరు అధికారి కంటెయినర్ నంబరు, ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి వెళుతుంది? అనే విషయాలు పరిశీలించాలి. కానీ అలా చేయడం లేదు. షిప్పింగ్ వ్యాపారంలో భారీగా వచ్చే లాభాల్లో కొంత మేర కస్టమ్స్, ఇతర అధికారులకు వాటాలు ఇవ్వడం వల్ల తనిఖీలు తూతూమంత్రంగా జరుగుతున్నాయి. ఇప్పుడు స్పష్టమైన సమాచారం ఇంటర్‌పోల్ నుంచి వచ్చింది కాబట్టి సీబీఐ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఆ సమాచారం రాకుంటే ఈ డ్రగ్స్ అన్నీ చేతులు మారి ఎక్కడెక్కడికో వెళ్లేవి. అధికారులు అంతా గంజాయి నివారణపై దృష్టిపెట్టగా, మరోవైపు ఏకంగా అంతకంటే ఎన్నో వందల రెట్లు విలువైన డ్రగ్స్‌ను విశాఖపట్నం తీసుకువచ్చి ఇక్కడి నుంచే పంపుతున్నారు. ఇదే ఆశ్చర్యకరమైన విషయం.

ఎవరికి సంబంధం ఉన్నట్టు?

డ్రై ఈస్ట్‌తో వచ్చిన కంటెయినర్‌లో డ్రగ్స్ ఉన్న విషయం తమకు తెలియదని సంధ్యా ఆక్వా కంపెనీ చెబుతోంది. అదే నిజమైతే ఆ కంటెయినర్‌ని విడిపించుకొని తీసుకువెళ్లాక..అందులో డ్రగ్స్ ఎలా అసలైన దిగుమతిదారులకు చేరుతాయి?, అందుకు గల మార్గాలు ఏమిటి?, ఒప్పందాలు ఏమిటి? అనే అంశాలపై కూడా సీబీఐ విచారణ చేయాల్సి ఉంది.

సముచిత స్థానం కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో మిత్రపక్షం అభ్యర్థి విజయానికి కృషిచేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గండి వంశీ భవిష్యత్తును యవనేత నారా లోకేశ్‌కు అప్పగిస్తానని అన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

లేదు. లబ్ధిదారులు నివాసం ఉండే ప్రాంతానికి సమీపంలో రోడ్డుపైకి పిలిచి జీవీఎంసీ యూసీడీ కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఈ నోటీసులు ఇస్తున్నారు. సిబిల్ స్కోరు లేనందున నేరుగా రుణం ఇవ్వలేమని బ్యాంకులు చెబుతున్నందున ఇంటి యూనిట్ ధర మొత్తం చెల్లించాలని గతంలో ఇచ్చిన నోటీస్‌కు స్పందన లేదని తాజా నోటీస్‌లో పేర్కొంటున్నారు. నోటీస్‌కు మూడు రోజుల్లో స్పందించకపోతే ఇంటిని రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వమే మధ్యవర్తిగా ఉంటూ రుణాలు మంజూరుచేయించాలి. అలా చేయకపోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఇళ్ల కేటాయింపు రద్దు చేస్తామంటూ నోటీసులు ఇవ్వడమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాకీ కిరాతకం

... 5వ పేజీ తరువాయి

శివాలయం వీధికి చెందిన గూడుపు జనయత్రి మహాలక్ష్మికి 2013లో తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన గూడుపు భవానీశంకర్ (38)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భవానీశంకర్ ప్రస్తుతం అనకాపల్లిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లైన నాలుగో నెల నుంచి భవానీశంకర్ కట్నం కోసం వేధింపులు ప్రారంభించాడు. దీంతోపాటు అనుమానంతో భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 17వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈనెల 18న మహాలక్ష్మిని ఆమె కన్నవారింటికి పంపించివేశాడు. మరుసటిరోజు అత్తారింటికి తిరిగి వెళ్లింది. అక్కడ అత్త, ఆడపడుచులు మందలించడంతో మహాలక్ష్మి పుట్టింటికి వచ్చేసింది. ఈ నెల 20వ తేదీన భవానీశంకర్ అత్తారింటికి వెళ్లి గట్టిగట్టిగా కేకలు వేస్తూ మహాలక్ష్మిపై దాడికి దిగాడు. ఆమె తప్పించుకుని ఓ గదిలోకి వెళ్లి ఉండిపోయింది. దీంతో భవానీశంకర్ మహాలక్ష్మి సోదరుడి బిడ్డను (14 నెలలు) గట్టిగా పట్టుకుని గదిలో నుంచి రాకుంటే గొంతు నొక్కేస్తానని హెచ్చరించాడు. మహాలక్ష్మి బయటకు రాగా భవానీశంకర్ తనతోపాటు తీసుకువెళ్లిన ట్రిమ్మర్‌తో ఆమె జుట్టును కత్తిరించి గుండు చేశాడు. ఆ తరువాత కనుబొమ్మలను తొలగించాడు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహాలక్ష్మి తండ్రి, స్థానికులు నిలువరించడంతో పారిపోయాడు. భర్త చేసిన అఘాయిత్యాలపై ఆమె ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.సూర్యారావు కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, వేధింపులు, తదితర నేరాలకు పాల్పడినందుకు 409ఎ, 307, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి శుక్రవారం భవానీ ప్రసాద్‌ను అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- వీర విహారం చేస్తున్న వీధి కుక్కలు
- చిన్నారులపై దాడికి తెగబడుతున్న వైనం
- రోడ్డుపైకి వచ్చేందుకు భయపడుతున్న జనం
- చర్యలు తీసుకోని జీవీఎంసీ యంత్రాంగం

కూర్మన్నపాలెం, మార్చి 22: వీధి కుక్కల స్వైర విహారంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. జీవీఎంసీ 86, 87వ వార్డుల పరిధిలోని వడ్లపూడి, కణితి, కూర్మన్నపాలెం, శాతవాహననగర్‌లో వీటి సంచారం అధికంగా ఉంది. రహదారులపై వెళ్తున్న పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులపై దాడి చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. విద్యార్థులను పరుగు పెట్టిస్తున్నాయి. వృద్ధులను విడిచిపెట్టడంలేదు. టిఫిన్ సెంటర్లు, మాంసం దుకాణాల వద్ద గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రివేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వస్తున్న పలువురు కార్మికుల వెంటపడుతున్నాయి. పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు.


86 వార్డు ఉడా నగర్‌లో కుక్కల గుంపు


కణితిలో గుంపులుగా వీధి కుక్కలు

కుక్కకాటు సంఘటనలు ఇవీ..

రాజులపాలెంలో గతేడాది జూన్ 24న నాలుగేళ్ల బాలుడు పవన్ సూర్య కుక్కకాటుతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉడానగర్ ఫేజ్-1లో మూడేళ్ల రెడ్డి కౌశిక్‌పై దాడి చేశాయి. గత డిసెంబరు 10న 87వ వార్డు అంబేడ్కర్ కాలనీలో 70 ఏళ్ల వృద్ధురాలు పొట్నూరు శాంతమ్మపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. వడ్లపూడిలో ఈనెల 4న ఓ పిచ్చి కుక్క నలుగురు చిన్నారులను కరిచింది. దీంతో తల్లిదండ్రులు వారికి కణితి పీహెచ్‌సీకి తరలించి వైద్యమందించారు. ఈ వార్డులో కుక్కల సంచారంపై స్థానికులు పలుమార్లు జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా తూతూమంత్రంగా చర్యలు తీసుకుని విడిచి పెడుతున్నారు. వీధి కుక్కల నియంత్రణలో జీవీఎంసీ విఫలమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహించిన అనంతరం ప్రాంతాలు మార్చి విడిచి పెట్టి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ చర్యలతో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని, కుక్కలను పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.


కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు (ఫైల్)

అప్రమత్తంగా ఉండాలి



వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి కణితి పీహెచ్‌సీ పరిధిలో నెలకు సుమారుగా 40 మంది వరకూ కుక్కకాటు బాధితులు వస్తున్నారు. వారికి విధిగా ఇంజక్షన్లు చేసి పంపుతున్నాం. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్కకాటుకు గురైన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- టి.శివయ్య, కణితి పీహెచ్‌సీ వైద్యాధికారి

కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యం


69వ వార్డు ఉమ్మడి నాయకులతో పల్లా శ్రీనివాసరావు


సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న పెదగంట్యాడ టీడీపీ శ్రేణులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి, మార్చి 22: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కలిసికట్టు పనిచేయాలని గాజువాక నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 79వ వార్డుకు చెందిన ఆయా పార్టీల నేతలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. శాసనసభలో గాజువాక నియోజకవర్గంలోని సమస్యలపై గళం విప్పడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఉమ్మడి పార్టీలతో శ్రేణులతో కలిసి స్థానిక భ్రమరాంబ ఆలయంలో పూజలు చేశారు. ఈకార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, బొండా జగన్, 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, జనసేన వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్, నేతలు కరణం సత్యారావు, గొల్లవిల్లి కనకభవానీ, వెంకటరావు, పైడిరాజు, జగదీశ్, సుబ్బరాజు, సింగిడి సింహాచలం, తాతారావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు స్వస్తి పలకాలి

ఆటోనగర్: వైసీపీ పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో శుక్రవారం బీ జేపీ, జనసేన నాయకులు దేనంకొండ కృష్ణంరాజు, లంకల మురళీదేవిలతో భేటీ అయ్యారు.తనకు మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. తొలితవార్డు టీడీపీ ఇన్‌చార్జి చట్టి గోపి, అధ్యక్షుడుకె.వి.ఎస్ శంకరరావు ఆధ్వర్యంలో పల్లాను స్వాగతం పలికారు. అనంతరం డ్రైవర్స్ కాలనీ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులను కలసి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు శ్రీకాంత్, కె.వి. సూరిబాబు, తుంపాల చిరంజీవి, పీబీఎల్‌మూర్తి, రోమాల శ్రీనివాసరావు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరికలు

గాజువాక: జీవీఎంసీ 64వ వార్డు గొద్దువాని పాలేనికి చెందిన పలువురు మహిళలు శుక్రవారం పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు నమ్మి సింహాద్రి, భూలోక, హరికృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

68, 69 వార్డులలో పర్యటన

అక్కిరెడ్డిపాలెం: టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు శుక్రవారం 68, 69 వార్డులలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులను కలిశారు. నాతయ్యపాలెంలో నేతలను కలసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు అక్కిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు అలమండ రాజు, శీరం రాజేశ్, పల్లెల వెంకటరమణ, వి. జీవన్ బాబు, నిర్మలాకుమారి, ఎం. ఆనంద్ , జనసేన నాయకులు గోపిశెట్టి గోపి, సంగ్రాన భాస్కర్, బీజేపీ నాయకులు కె.శ్రీరామూర్తి, బి.శ్రీను తదితరులు పాల్గొని పల్లాకు మద్దతు ప్రకటించారు. అక్కిరెడ్డిపాలెంలో పలువురు జనసేన నాయకులనూ పల్లా కలిశారు.

పేదలకు అండగా టీడీపీ

పెదగంట్యాడ: పేదవర్గాలకు అండగా టీడీపీ నిలుస్తుందని అందుకు సూపర్‌సిక్స్ పథకాలు దోహదపడతాయని నేతలు అన్నారు. పెదగంట్యాడ మండల టీడీపీ శ్రేణులు శుక్రవారం 75వ వార్డు పరిధి సీతానగరం, నెల్లిముక్కు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. రైతులు, మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారన్నారు. 20లక్షల మందికి ఉపాధికల్పన, నిరుద్యోగికి నెలకు రూ.3వేలు భృతి, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ. 15వేలు, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెల రూ. 1,500 ఆర్థిక సాయం అందుతాయన్నారు. ప్రచారంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి వెంకటరమణారెడ్డి, మొల్లి రమణ, ములకలపల్లి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఆడారి ఆనంద్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న 63వ వార్డు వైసీపీ నాయకులు

వైసీపీతోనే సంక్షేమ పథకాలు అమలు : ఆడారి ఆనంద్

సింథియా, మార్చి 22 : సంక్షేమ పథకాల అమలుతోనే ప్రజలకు మేలు జరుగుతుందని పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గ్రేటర్ 63వ వార్డు వైసీపీ అధ్యక్షుడు సోమాదుల సురేష్ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన తరువాత నియోజకవర్గం పరిధిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశానన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి వైసీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను అవసరమైతే తన సొంత నిధుల నుంచి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలిదండి బద్రీనాథ్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవరచుకోవాలి

మల్కాపురం, మార్చి 22: విద్యార్థులు సేవా కార్యక్రమాలను అలవరుచుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ కో - ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం 1 , 2 యూనిట్ల ఆధ్వర్యంలో ఇందిరాకాలనీ , బర్మాకాలనీలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల ముగింపు సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సేవ చేయడం ద్వారా నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయన్నారు. ఇతరుల కోసం జీవించడంలోనే సార్థకత ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రొగ్రామ్ -1 అధికారి ఎ.సంధ్యారాణి అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కాలేజీ యజమాన్య ప్రతినిధి సిస్టర్ జయశీల, సీనియర్ ప్రొగ్రామ్ అధికారి అనసూయదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

మల్కాపురం, మార్చి 22 : వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా రాయపురెడ్డి అనిల్‌కుమార్‌ను నియమించారు. ఇప్పటి వరకు పనిచేసిన కలిదండి బద్రీనాథ్‌కు ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు.

భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు దోహదం

- ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

కూర్మన్నపాలెం, మార్చి 22: నీరు ప్రాణాధారమని శ్రీ తిరుమల నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలనీలో ఇంకుడు గుంతలను తవ్వారు. భూగర్భ జలాల పెంపుదలకు ఇంకుడు గుంతల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, శానిటరీ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాటర్ హీరో అవార్డు గ్రహీత పరమానందంను కాలనీ వాసులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రాధాకృష్ణ, పరమేశ్వరరావు, సన్యాసిరావు, పీఎస్ఎన్ రెడ్డి, వసంత రెడ్డి, మల్లికార్జున్, చంద్రశేఖర్, సత్యనారాయణ,అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న ఉక్కు సీజీఎం

నీటి పొదుపుతోనే భవిష్యత్తు

ఉక్కుటౌన్‌షిప్: నీటి పొదుపుతోనే భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఏకే సోట్టి అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని అత్యంత పొదుపుగా వాడాలన్నారు. ఉక్కు పరిశ్రమల్లో నీటి వినియోగం చాలా ఎక్కువగా ఉం టుందని, ఈ నీటిని పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.


నీటి వినియోగంపై ర్యాలీ చేస్తున్న చిన్నారులు

26న పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, తదితరులు

పెదగంట్యాడ, మార్చి 22: పెదనడుపూరు గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఈనెల 26న జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కాలనీ పెద్దలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఉత్సవకమిటీ చైర్మన్ ములగపాక అచ్చంనాయుడు, చెల్లబోయిన నాయుడు, తాటికొండ జగదీష్, శంకరనారాయణ, సుదర్శనరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు శని త్రయోదశి పూజలు

వేపగుంట మార్చి 22: నాయుడుతోట కృష్ణానగర్ దుర్గా మల్లేశ్వరాలయంలోని నవగ్రహాలకు శనివారం త్రయోదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పౌర్ణమి ముందు వచ్చే త్రయోదశి విశిష్టమైనదని, తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 10.30వరకు తైలాభిషేకాలు, ఇతర పూజలు జరుగుతాయన్నారు.

ప్రసన్నగిరి ఆలయ హుండీ లెక్కింపు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 22: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపైనున్న శ్రీవెంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానం హుండీని శుక్రవారం లెక్కించారు. గత ఏడాది డిసెంబరు 8 నుంచి ఈనెల 22 వరకు భక్తులు వేసిన కానుకలను ప్రత్యేక అధికారి ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించగా రూ. 1,22,823 ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఈవో ఎ. జగన్నాధం, పాలకమండలి చైర్మన్ రామునాయుడు, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక బోర్డు సరిచేయరా?


పడిపోయిన కరాస శ్మశానవాటిక బోర్డు

ఎన్.ఎ.డీ జంక్షన్ మార్చి 22: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని కరాస శ్మశానవాటిక బోర్డు పడిపోయి నెలలు గడుస్తున్నా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడ లేదు. ఈ వాటిక ప్రవేశ మార్గంలో ఏర్పాటు చేసిన ఐరన్ బోర్డు తప్పు పట్టి పడిపోయింది. తాడుతో కట్టి ఉంచారు. ఇదే మార్గంలో రాకపోకలు సాగించే ప్రజాప్రతినిధులు దీనిని పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి బోర్డును యథాస్థానంలో ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉక్కుతో ప్రభుత్వాల దోబూచులాట

కూర్మన్నపాలెం, మార్చి 22: స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించడం దారుణమనివిశాఖ ఉక్కు పోరాట పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పోరాట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరుగుతున్న 1135 రోజు నిరాహార దీక్షల్లో పాల్గొన్న కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే ప్లాంట్‌ను అంధకారంలోకి నెట్టేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హుకుం జారీ చేయగా, మరోవైపు మీ జీతాలు, పింఛన్లకు సంబంధించి ఆదాయాలను సంస్థే చూసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేటర్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. దీనిపై పోరాటం ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విశాఖ ఉక్కు పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 20, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 144, బరబటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 74, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 30, కంద 60, దేముడుచిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి: గణబాబు


ఎమ్మెల్యే గణబాబుకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గోపాలపట్నం, మార్చి 22: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్, డీఏఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కూటమి విజయమే లక్ష్యం'


పంచకర్లను సత్కరిస్తున్న రామునాయుడు

పెందుర్తి, మార్చి 22: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జనసేన పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల రమేశబాబు అన్నారు. బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడుతో శుక్రవారం ఆయన భేటా అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనసేన కార్యదర్శి అయిత సింహాచలం, గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: సీఐ


వాహనాలను తనిఖీ చేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 22: వాహనదారులు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వాహనాలను తనిఖీలు చేపట్టారు. అలాగే, టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 22: విద్యార్థులు సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు అన్నారు. తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పలు లోన్ యాప్‌లను వినియోగిస్తున్నారన్నారు. వీటి వల్ల చా లా ప్రమాదమన్నారు. వ్యక్తిగత వివరాలను ఇవ్వడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు చదువుపై మాత్రమే శ్రద్ధ వహించాలని, ఇతర వ్యవహారాలకు దూరంగా ఉండాలని కోరారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి కళాక్షేత్రం మాజీ కార్యదర్శిపై ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 22: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-9లోని ఆంధ్రకేసరి కళాక్షేత్రం కార్యదర్శిగా పనిచేసిన సీహెచ్‌వీ.సత్యనారాయణపై నూతన కార్యదర్శి టి.సత్యనారాయణ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళాక్షేత్రానికి సంబంధించి రికార్డులను అడిగితే వాగ్వాదానికి దిగి మిగిలిన సభ్యుల సమక్షంలో బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికితోడు సభ్యులతో కలిసి కార్యాలయానికి కొత్త తాళం వేయగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సీహెచ్‌వీ.సత్యనారాయణ వాటిని పగలగొట్టి విలువైన డాక్యుమెంట్లు పట్టుకుపోయారన్నారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసినూతన కార్యదర్శి టి.సత్యనారాయణ పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు


కొత్తపాలెం నూరానియా మసీదులో ఇఫ్తార్ విందు

గోపాలపట్నం, మార్చి 22: రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తున్నారు. గోపాలపట్నంలోని తాహా మసీదు, కొత్తపాలెంలోని నూరానియా మసీదు, నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ సందర్భంగా మసీదుల్లో ప్రతిరోజు ఐదు వేళల ఆచరించే నమాజులతో పాటు రాత్రి వేళలో ఆచరించే తరావీ నమాజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో నిర్వహించే ఇఫ్తార్ విందులతో పండగ వాతావరణం నెలకొంటోంది.

సందడిగా అంతర్జాతీయ అటవీ దినోత్సవం


పోర్టు ఆవరణలో అటవీ దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు, కార్మికులు

పెదగంట్యాడ, మార్చి 22: అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం అదానీ గంగవరం పోర్టులో ఘనంగా నిర్వహించారు. పోర్టు అధికారులు, కార్మికులు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. వాతావరణంలో మార్పుల వల్ల జీవవైవిధ్యానికి కలుగుతున్న నష్టాలను గుర్తించి, వందమిలియన్ మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే రెండు లక్షల మొక్కలు నాటామన్నారు. పోర్టు అంతర్గత నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు తయారుచేస్తున్నామని, అడవుల పెంపకానికి పోర్టు కట్టుబడి ఉందన్నారు.

ఏయూను సందర్శించిన అమెరికా నావికాదళం

వెంకోజీపాలెం, మార్చి 22 : ఏయూను అమెరికా నావికా దళ బృందం శుక్రవారం సందర్శించింది. ముందుగా వారు వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలో రక్షణ రంగాలకు విద్యాపరంగా సేవలందిస్తున్న వర్సిటీగా ఏయూ పేరుగాంచిందని చెప్పారు. ప్రస్తుతం భారత దేశంలో త్రివిధ దళాల ఉద్యోగులకు ఉన్నత విద్యను చేరువ చేసే దిశగా పని చేస్తున్నా మని, భవిష్యత్తులో విదేశీ సైనికులకు కూడా ఉన్నత విద్య అవకాశాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అమెరికా నావికాదళం కమాండింగ్ అధికారి మిచెల్ సి. బ్రాండ్ మాట్లాడుతూ సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖ తమకు ఎంతో నచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కాన్వెంటు కూడలిలో తనిఖీ



ఆటోకు ఉన్న రాజకీయ పోస్టర్ తొలగిస్తున్న పోలీసులు

జ్ఞానాపురం, మార్చి 22: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా కాన్వెంటు కూడలిలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు.ఆటోలు, కారులపై ఉన్న రాజకీయ పోస్టర్లను గుర్తించివాటిని తొలగించారు. వాహనాలపై రాజకీయ సంబంధిత పోస్టర్లను తొలగించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కటౌట్లు తొలగించరా..'



శాంతిపురంలో నిలిచి ఉన్న రథంపై ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ పోస్టర్లు

అక్కయ్యపాలెం, మార్చి 22: ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయకుండా సచివాలయం ఉద్యోగులు, జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ ఆరోపించారు. వార్డు పరిధి శాంతిపురంలోని ఎల్‌టీ పార్కుకు ఆనుకుని ఉన్న రోడ్డుపై ఉత్తరాంధ్ర ప్రజా పార్టీకి చెందిన ప్రచార రథం పార్కింగ్ చేశారు. దానికి ఉన్న కటౌట్లు తొలగించకుండా అలాగే వదిలేశారన్నారు. అదే ప్రాంతంలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంపై కటౌట్లను తొలగించలేదన్నారు. ఈ విషయాన్ని సచివాలయం ఉద్యోగులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని చెప్పారు. అలాగే, ఎన్‌జీజీఓస్ కాలనీ సమీపాన జై భారత్ పార్టీ కార్యాలయం ఎదుట రోడ్డుపై కటౌట్లు పెట్టారన్నారు. దీనికి సమీపంలో పోలింగ్ బూత్ ఉందని, దాన్ని కూడా ఆ పార్టీ నాయకులు పట్టించుకోలేదని పేర్కొన్నారు.అధికారులుస్పందించి కటౌట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కాన్వెంట్ కూడలికి వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనదారుల పాట్లు



రహదారిపై పడిన భారీ గొయ్యి

ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడల్!

- అడుగడుగునా దర్శనమిస్తున్న గోతులు
- అవస్థల మధ్య రాకపోకలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- మరమ్మతులు చేపట్టని అధికారులు

జ్ఞానాపురం, మార్చి 22: ఆ రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. అడుగడుగునా గోతులతో నరకం చూస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. కాన్వెంట్ కూడలి నుంచి రామకృష్ణ జంక్షన్‌కు వెళ్లే రహదారి అత్యంత ప్రమాదరకంగా మారింది. ముఖ్యంగా హార్బర్ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయింది. దీంతో ఆటువైపు వెళ్లాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా గతుకుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. గతంలో ఈ ప్రాంతానికి ముందు, తరువాత కొత్తగా రహదారి నిర్మించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నా కనీసం గోతులు పూడ్చే ప్రయత్నం చేయలేదు. పూర్ణామార్కెట్, పాత పోస్టాఫీస్‌కు వెళ్లేందుకు ఇది దగ్గరదారి కావడంతో అధికశాతం మంది వాహనదారులు ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. ఈ నేపథ్యంలో వాహనాలు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యను గుర్తించి అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, కొత్తగా లేయర్ వేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులతోపాటు వాహన చోదకులు కోరుతున్నారు.

బ్రిటీష్ కాలం కంటే జగన్ పాలన దారుణం

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

కంచరపాలెం, మార్చి 22 : బ్రిటీష్ కాలంలో పరిపాలన కంటే జగన్మోహన్ రెడ్డి పాలన దారుణంగా ఉందని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఊర్వశి జంక్షన్ అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి శుక్రవారం పార్టీ కార్యాలయాన్ని విష్ణుకుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అవినీతి, భూ కబ్జాలు, దోపిడీలు తప్పా ఎక్కడా అభివృద్ధి జాడలేదన్నారు. ఎవరైనా ఎదురించి ప్రశ్నిస్తే వారిని వేధించడం వైసీపీ పాలకుల నైజంగా మారిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడని ఒక్క అవకాశాన్ని ప్రజలు అందిస్తే రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాడన్నారు. అవినీతి రాజ్యమేలుతోందని, ప్రజలుఎవరికీ భద్రతలేకుండా పోతోందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడక తప్పదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్, పెంటకోట ప్రవంతి, రంగుముద్ర రాంబాబు, పొలమరశెట్టి శ్రీను, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే టౌన్‌షిప్ అధినేతకు టికెట్ కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 22: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున చీరాల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు ఆర్‌కే టౌన్‌షిప్ గ్రూప్, ఆర్‌కే ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌ల అధినేత మద్దులూరి మాలకొండయ్యని అధిష్టానం ఖరారు చేసిన సందర్భంగా ఆయనకు ఆర్‌కే టౌన్‌షిప్ విశాఖ, ద్వారకానగర్ శాఖ మేనేజర్లు ఎ.వేణుగోపాల్, బి.అప్పారావు పీఆర్‌ఏ వెంకట్, వి.జవహర్, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, మార్కెటింగ్ జీఎంలు పి.అప్పలనాయుడు, ఆర్‌కె చౌదరి, జి.రాజేష్‌బాబు, బి.భాస్కరరావు, ఎస్‌పి నాయుడు, కె.కోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది పి.రామారావు, కె.పాపారావు, జి.రమేష్‌బాబు, రామకృష్ణ, డి.ప్రతాప్, మహేశ్, పైడిరాజు, రామచంద్రరావు, డి.సుస్మిత, కె.పంకజ, బి.శ్రీదేవి, కె.సీతామహాలక్ష్మి, సరోజిని, కె.ఆదినారాయణ, రమణారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖను అంతర్జాతీయ డ్రగ్స్ రాజధానిగా మార్చారు

- జనసేన పార్టీ నేతలు



డ్రగ్స్‌పై పోస్టర్‌ని ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

సీతంపేట, మార్చి 22: వైసీపీనేతలు విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా మారుస్తానని చెప్పి దేశానికి గంజాయి, డ్రగ్స్ మూల కేంద్రంగా మార్చేసి పరువుతీశారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనమాట్లాడారు. విశాఖ పోర్టులో సీబీఐ స్వాధీనం చేసుకున్న రూ. 50 వేల కోట్ల విలువైన డ్రగ్స కం టైనర్ అధికార వైసీపీ నేతలదేనని ప్రతిపక్షాలతో పాటు ఆటు సోషల్ మీడియా ఆరోపిస్తుంటే, ఆ పార్టీ నేతలు మాత్రం నోరు విప్పడం లేదన్నారు. డ్రగ్స్ దిగుమతి చేసుకొన్నకూనం వీరభద్రరావు వైసీపీకి చెందిన వ్యక్తి కావడం,డ్రగ్స్ వచ్చిన బ్రెజిల్ దేశాధ్యక్షుడిని కీర్తిస్తూ గతంలో ఆ పార్టీలో నెంబర్ టు అయిన విజయసాయి రెడ్డి ట్విట్టర్‌లో మేసేజ్ పెట్టడం డ్రగ్స్ బంధాన్ని బలపరుస్తోందని ఆరోపించారు. ప్రశాంతతకు మారుపేరైన విశాఖలో రిటైర్మెంట్ అనంతరం ఇక్కడ జీవించాలని చాలా మంది కోరుకుంటారని, అలాంటి నగరంహింస, గంజాయికి నిలయంగా, డ్రగ్స్‌కి నిలయంగా మారడం శోచనీయన్నారు.

డ్రగ్స్ దిగుమతిలో వైసీపీ నేతల హస్తం

ఇటీవల వరకు కేవలం గంజాయి మాత్రమే విశాఖలో దొరుకుఉందని భావించారని, ఇప్పుడు ఇతర దే శాల నుంచి నేరుగా భారీ స్థాయిలో డ్రగ్స్ రవాణా కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి చేసుకున్నవారు, చేయించినవారు వైసీపీ నేతలేనన్న పోస్టర్లను నాయకులు ప్రదర్శించారు. పోర్టులో డ్రగ్స్ తనిఖీలను రాష్ట్ర పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేయడం ఆపార్టీ నేతలను రక్షించేందుకే అన్నా రు. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో ఇంకెన్ని కంటైనర్లు దిగుమతి చేశారోనని ఆయన పేర్కొన్నారు. దిగుమతి అయిన 25 వేల కేజీల డ్రగ్స్ ఎన్నికల ముందుదేశంలోకి వెళ్లినట్లయితే, యువత పరిస్థితి ఏమిటనేది భయమేస్తుందన్నారు. కొద్ది రోజుల క్రితం ఎంపీ ఎంవీవీ భార్యపై దాడి జరిగిందని, ఈ రోజు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ సతీమణిని కత్తితో భయపెట్టి పట్టపగలే చోరీ చేసుకుందటే, నగరంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో తెలుస్తోందన్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన తరువాత విశాఖ పోర్టు, గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టులలో జరిగిన అనుమానాస్పదన రవాణాపై విచారణ జరపాలన్నారు. ఇందులో భాగస్వాములైన వైసీపీ నేతల పేర్లు బయటపెట్టి ఎన్నికలలో వారిని అనర్హులుగా ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు, పోతు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు

జనసేన సైనికులకు పరామర్శ



కుటుంబాలతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ యాదవ్

జగదాంబ కూడలి, మార్చి 22: దక్షిణ నియోజవర్గంలో ఇటీవల జరిగిన ఘర్షణలో పోలీసు కేసులు నమోదైన జనసేన కార్యకర్తల కుటుంబాలను ఆ పార్టీ నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులతో కలసి కల్లుపాకలు, ప్రసాద్ గార్డెన్స్, కోటవీధి ప్రాంతాలకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలను కలసి వారిని ఓదార్చారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. కేసులో ఇరుకున్న జనసేనికులకు చట్టపరంగా సాయమందిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గఫూర్, రామిరెడ్డి తదితరులతో కలసి 35, 39 వార్డులో పర్యటించారు, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

డ్రగ్స్ లభ్యం ఆందోళనకరం: ఏబీవీపీ

అక్కయ్యపాలెం, మార్చి 22: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నగరంలో సీబీఐ అధికారులు భారీ స్థాయిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ అన్నారు. విశాఖ గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు కేంద్రంగా మార్చివిద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఈ డ్రగ్స్ మాఫియా వెనుక ఉన్న రాజకీయ నాయకులను, అధికారులపై సమగ్ర విచారణ జరిపి అరెస్టు చేయాలని, డ్రగ్స్ డెలివరీ నిమిత్తం రిజిస్టర్ అయిన ప్రైవేటు కంపెనీ లైసె న్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానం పెంపొందించేందుకు సదస్సులు దోహదం

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్



జాతీయ స్థాయి సదస్సు ప్రారంభంలో అతిథులు

జ్ఞానాపురం, మార్చి 22: జాతీయ స్థాయి సదస్సులు విజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు దోహదపడతాయని ఏ యూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైకాలజీ, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై రెం డు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును శుక్రవారం ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, స్టీఫెన్, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కె.రామిరెడ్డి దీప ప్రారంభించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించగలిగితే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. మనస్తత్వ, వ్యాపార నిర్వహణ, అభివృద్ధి తదితర అంశాలపై డా.కె.రామిరెడ్డి,ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, కన్వీనర్ డా.డి. రాజ్యలక్ష్మి, డా.ఎస్.జ్యోతి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయుడు గంట్ల శ్రీనుబాబు ఆర్.పావని, డా.జాన్‌పాల్ రాజ్, డా.వి.శ్రీనివాస్, డా.వీరభద్రస్వామి,డాక్టర్ అరుణ, డాక్టర్ సుధ, డా.వీకే జయలక్ష్మి పాల్గొన్నారు.

పశ్చిమ పరిశీలకురాలిగా పేడాడ.రమణికుమారి

మురళీనగర్, మార్చి 22 ; సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ వెస్ట్ నియోజకవర్గ పరిశీలకురాలిగా ఆపార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ.రమణికుమారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ జంక్షన్ హైవే రోడ్డులోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం అభినందన కార్యక్రమం చేపట్టారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఎ.ఆనంద్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.ఎ.రహమాన్, ఉమారాణిల,నాయకులున్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఆశ్రిత, పృథ్వీరాజ్‌కు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 22: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థులు ఆశ్రిత, పృథ్వీరాజ్ పతకాలు సాధించారు. మీరట్‌లో జరిన ఈ టోర్నీ మహిళల 50 కిలోల విభాగంలో బి.ఆశ్రిత స్వర్ణ పతకం కైవసం చేసుకోగా, పురుషుల 63 కిలోల విభాగంలో కె. పృథ్వీరాజ్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుల్లయ్య కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ శుక్రవారం తన కార్యాలయంలో వీరిద్దరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు

సీతంపేట, మార్చి 22: మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మహిళలపై అనుచిత వ్యాఖ్యాలు చేశారంటూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో వైసీపికి చెందిన మహిళా నాయకులు సీఐ విజయ్‌కుమార్‌కి ఫిర్యాదును అందచేశారు. అయనపై చర్యలకు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వైసీపీ టోపీలు!



గొల్ల జగ్గారాజుపేటలో వైసీపీ టోపీలు ధరించిన పాఠశాల పిల్లలు

విశాఖపట్నం, మార్చి 22: వైసీపీ ప్రచారంలో పాఠశాల చిన్నారులను వదలడంలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏకంగా పాఠశాల పిల్లలకు వైసీపీ టోపీలు పం పిణీచేసి నిబంధనలను ఉల్లంఘిస్తోంది. వీటి పంపిణీలో వలంటీర్లు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. వివరాలివి.. గ్రేటర్ 88వ వార్డు గొల్లజగ్గరాజుపేట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద పిల్లలు వైసీపీ టోపీలు ధరించి కనిపించారు. స్థానికులు ఆ చిన్నారుల వద్ద ఆరా తీయగా వలంటీర్లు ఇచ్చినట్టు బదులిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ టోపీలు అడు గుతుండడంతో వాటిని వారు బ్యాగుల్లో పెట్టుకున్నారు. కాగా, అక్కడికి సమీపంలో ఉన్న మరికొన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సైతం వైసీపీ టోపీలు పంపిణీచేసినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఎన్నికల విధులు, ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొన రాదని కోర్టు ఆదేశాలున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా పలు ప్రాంతాల్లో చీరలు, ఇతర వస్తువులు వలంటీర్ల చేతుల మీదుగా పంపిణీ అవుతున్నట్టు పారిశ్రామిక ప్రాంతంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భార్యా, కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం,మార్చి 22 : భార్యా కుమారుడు అదృశ్యంపై కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు నమోదైంది. వివరాలివి.. కంచరపాలెం కప్పరాడ ప్రాంతంలో ఉంటున్న మూల ధర్మారావుకి భార్య రమ (29), ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నకుమారుడు ఫాల్గుణ (15) పుట్టిన రోజుకు కొత్త దుస్తులుకొనుగోలుకు భర్త వద్ద రూ.వెయ్యి తీసుకుని ఈనెల 20న సాయంత్రం రమ కుమారుడితో కలిసి బయటకు వెళ్లారు. అలా వెళ్లిన వారిద్దరు రాత్రయినా,ఇంటికి చేరకపోవడంతో ధర్మారావు, బంధువులు ఇళ్లల్లో, పరిసర ప్రాంతాల్లో వెతికారు. వారి ఆచూకీ లభించకపోవడంతో స్థానిక శుక్రవారం ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెచ్ వై.ప్రకాశరావు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి గన్‌మన్‌కు గాయాలు

విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీచ్‌రోడ్డు ఏరియాలో నివాసం ఉంటున్న ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి వద్ద పనిచేసిన గన్‌మన్ మేడ పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో గాయపడిన అతడిని ఆరిలోవ ఏరియాలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వర్గాలు ఫిర్యాదుచేయడంతో ఆరిలోవ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ వ్యవహారంపై పలు రకాల కథనాలు వినిపిస్తున్నాయి.

49, 50 వార్డుల్లో వైసీపీ ప్రచారం

మాధవధార, మార్చి 22: విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యునిగా తనను గెలిపిస్తే ప్రజలు గర్వ పడేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆ పార్టీ సమన్వకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన49, 50వవార్డుల్లో పర్యటించారు. ఉదయం వాకర్స్‌క్లబ్ సభ్యులతో మాట్లాడారు. వ్యాయామం చేసేందుకు వచ్చిన యువతను తమ ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డుల కార్పొరేటర్లు, సుదర్శన్ పార్కు కమిటీ, మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకి ఓటేసి వైసీపీని గెలిపించాలని అభ్యర్థించారు.

విశాఖ కేంద్రంగా డ్రగ్స్ రవాణా!

... 5వ పేజీ తరువాయి

తీసుకోవాలి. దానిని పరీక్షకు పంపాలి. కానీ విశాఖలో అలా జరగడం లేదు. వంద కంటెయినర్లు వస్తే అందులో నాలుగైదు మాత్రమే కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసి 'అవుట్ ఆఫ్ ఛార్జ్' అని సర్టిఫై చేసేస్తున్నారు. మిగిలిన కంటెయినర్లను ఆయా సంస్థల ప్రతినిధులే తెరిచి..శాంపిల్ తీసి ప్యాకింగ్ చేసి కస్టమ్స్ ఆఫీసులో అందజేస్తున్నారు. ఇదొక్కటే కాకుండా టెర్మినల్ నుంచి కంటెయినర్ బయటకు వచ్చినప్పుడు ప్రభుత్వానికి చెందిన సిపాయి ఒకరు ఉంటారు. సదరు అధికారి కంటెయినర్ నంబరు, ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి వెళుతుంది? అనే విషయాలు పరిశీలించాలి. కానీ అలా చేయడం లేదు. షిప్పింగ్ వ్యాపారంలో భారీగా వచ్చే లాభాల్లో కొంత మేర కస్టమ్స్, ఇతర అధికారులకు వాటాలు ఇవ్వడం వల్ల తనిఖీలు తూతూమంత్రంగా జరుగుతున్నాయి. ఇప్పుడు స్పష్టమైన సమాచారం ఇంటర్‌పోల్ నుంచి వచ్చింది కాబట్టి సీబీఐ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఆ సమాచారం రాకుంటే ఈ డ్రగ్స్ అన్నీ చేతులు మారి ఎక్కడెక్కడికో వెళ్లేవి. అధికారులు అంతా గంజాయి నివారణపై దృష్టిపెట్టగా, మరోవైపు ఏకంగా అంతకంటే ఎన్నో వందల రెట్లు విలువైన డ్రగ్స్‌ను విశాఖపట్నం తీసుకువచ్చి ఇక్కడి నుంచే పంపుతున్నారు. ఇదే ఆశ్చర్యకరమైన విషయం.

ఎవరికి సంబంధం ఉన్నట్టు?

డ్రై ఈస్ట్‌తో వచ్చిన కంటెయినర్‌లో డ్రగ్స్ ఉన్న విషయం తమకు తెలియదని సంధ్యా ఆక్వా కంపెనీ చెబుతోంది. అదే నిజమైతే ఆ కంటెయినర్‌ని విడిపించుకొని తీసుకువెళ్లాక..అందులో డ్రగ్స్ ఎలా అసలైన దిగుమతిదారులకు చేరుతాయి?, అందుకు గల మార్గాలు ఏమిటి?, ఒప్పందాలు ఏమిటి? అనే అంశాలపై కూడా సీబీఐ విచారణ చేయాల్సి ఉంది.

సముచిత స్థానం కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో మిత్రపక్షం అభ్యర్థి విజయానికి కృషిచేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గండి వంశీ భవిష్యత్తును యువనేత నారా లోకేశ్‌కు అప్పగిస్తానని అన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

లేదు. లబ్ధిదారులు నివాసం ఉండే ప్రాంతానికి సమీపంలో రోడ్డుపైకి పిలిచి జీవీఎంసీ యూసీడీ కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఈ నోటీసులు ఇస్తున్నారు. సిబిల్ స్కోరు లేనందున నేరుగా రుణం ఇవ్వలేమని బ్యాంకులు చెబుతున్నందున ఇంటి యూనిట్ ధర మొత్తం చెల్లించాలని గతంలో ఇచ్చిన నోటీస్‌కు స్పందన లేదని తాజా నోటీస్‌లో పేర్కొంటున్నారు. నోటీస్‌కు మూడు రోజుల్లో స్పందించకపోతే ఇంటిని రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వమే మధ్యవర్తిగా ఉంటూ రుణాలు మంజూరుచేయించాలి. అలా చేయకపోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఇళ్ల కేటాయింపు రద్దు చేస్తామంటూ నోటీసులు ఇవ్వడమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాకీ కిరాతకం

... 5వ పేజీ తరువాయి

శివాలయం వీధికి చెందిన గూడుపు జనయత్రి మహాలక్ష్మికి 2013లో తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన గూడుపు భవానీశంకర్ (38)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భవానీశంకర్ ప్రస్తుతం అనకాపల్లిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లైన నాలుగో నెల నుంచి భవానీశంకర్ కట్నం కోసం వేధింపులు ప్రారంభించాడు. దీంతోపాటు అనుమానంతో భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 17వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈనెల 18న మహాలక్ష్మిని ఆమె కన్నవారింటికి పంపించివేశాడు. మరుసటిరోజు అత్తారింటికి తిరిగి వెళ్లింది. అక్కడ అత్త, ఆడపడుచులు మందలించడంతో మహాలక్ష్మి పుట్టింటికి వచ్చేసింది. ఈ నెల 20వ తేదీన భవానీశంకర్ అత్తారింటికి వెళ్లి గట్టిగట్టిగా కేకలు వేస్తూ మహాలక్ష్మిపై దాడికి దిగాడు. ఆమె తప్పించుకుని ఓ గదిలోకి వెళ్లి ఉండిపోయింది. దీంతో భవానీశంకర్ మహాలక్ష్మి సోదరుడి బిడ్డను (14 నెలలు) గట్టిగా పట్టుకుని గదిలో నుంచి రాకుంటే గొంతు నొక్కేస్తానని హెచ్చరించాడు. మహాలక్ష్మి బయటకు రాగా భవానీశంకర్ తనతోపాటు తీసుకువెళ్లిన ట్రిమ్మర్‌తో ఆమె జుట్టును కత్తిరించి గుండు చేశాడు. ఆ తరువాత కనుబొమ్మలను తొలగించాడు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహాలక్ష్మి తండ్రి, స్థానికులు నిలువరించడంతో పారిపోయాడు. భర్త చేసిన అఘాయిత్యాలపై ఆమె ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.సూర్యారావు కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, వేధింపులు, తదితర నేరాలకు పాల్పడినందుకు 409ఎ, 307, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి శుక్రవారం భవానీ ప్రసాద్‌ను అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యల్లమ్మ తల్లి మారు వారం రేపు

భీమునిపట్నం, మార్చి 22 : పట్టణంలోని రెల్లివీధిలో వెలసిన యల్లమ్మ తల్లి మారు వారం పండుగ ఆదివారం జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 16, 17 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు జరిగిన విషయం తెలిసిందే.మారు వారం పురస్కరించుకుని ఉదయం 7 నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి దర్శించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

అభయ గణపతి ఆలయ వార్షికోత్సం ప్రారంభం

ఆరిలోవ, మార్చి 22 : జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలోని సాలిపేటలో వెలసిన అభయ గణపతి ఆలయం ఐదో వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిచారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కాగా శనివారం ఉదయం జల, క్షీరాభిషేకాలు, పలు పూజలు జరపనున్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో లక్ష్మీగణపతి హోమం, స్వామివారి కల్యాణం జరగనుంది. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు వానపల్లి గణేష్ తెలిపారు.

విశాఖను అభివృద్ధి చేస్తా : ఝాన్సీ



బొత్స ఝాన్సీని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

భీమునిపట్నం (రూరల్), మార్చి 22 : వచ్చే ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే విశాఖను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని, పారిశ్రామికంగా దేశంలో అత్యున్నత స్థాయికి తీసుకువెళ్తానని వైసీపీ ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె తాళ్లవలసలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రత్యేక స్థానం ఉన్న విశాఖ రానున్న కాలంలో రాజధానిగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే భీమిలిని పర్యాటకంగా ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో యువ నాయకులు వెంకట్రావు, హరి, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండలో టీడీపీ నాయకుల సంబరాలు

సాగర్‌నగర్, మార్చి 22 : విశాఖ ఎంపీ స్థానాన్ని ఎమ్.శ్రీభరత్‌కు కేటాయించడం పట్ల టీడీపీ నాయకులు రుషికొండలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో అక్కరబోయిన రాంబాబు, గద్దిపల్లి కృష్ణకుమార్, పీతల రాజు, చందక కృష్ణ, టి. వెంకటేష్, ఉమ్మిడి చిన్నారావు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, మార్చి 22 :వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు, బాలభోగ నివేదనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పుష్ప వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమ శాస్త్రోక్తముగా కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అంతకముందు సహస్రనామ తులసీ దళార్చన జరిపారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 20, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 144, బరబటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 74, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

పద్మనాభంలో వరుస చోరీలు

- 40 రోజుల్లో నాలుగు దొంగతనాలు
- చెడ్డీ గ్యాంగ్ దోపిడీతో మరింత భయాందోళన
- నేర నియంత్రణపై దృష్టిసారించని పోలీసులు



పద్మనాభం, మార్చి 22 : మండలంలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ముఖ్యంగా సత్యనారాయణపురంలో చెడ్డీ గ్యాంగ్ దోపిడీకి పాల్పడిన ఘటనతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చోరీలు, నేరాలపై స్థానిక పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న ఈ స్టేషన్‌లో లా అండ్ ఆర్డర్, క్రైమ్ విభాగం వేర్వేరుగా ఉన్నా నేరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇక్కడి పోలీసులు విధి నిర్వహణ కంటే మామూళ్ల వసూళ్లకే మక్కువ చూపడంతో అసలు విధులకు ముఖం చాటేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.మట్టి, బియ్యం అక్రమ రవాణా, క్వారీలకు అవసరమైన మందుగుండు సామగ్రి అక్రమ రవాణా తదితర కార్యకలాపాల ద్వారా నెలవారీ స్టేషన్ మామూళ్లు ఇబ్బడిముబ్బడిగా రావడంతో విధి నిర్వహణను గాలికి వదిలేసారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి గస్తీ సమయంలో ఇటువంటి రవాణా వాహనాల తనిఖీపై ఉన్న శ్రద్ధ దొంగతనాల నియంత్రణపై లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో ఇసుక అక్రమ రవాణాలో మామూళ్ల మత్తులో మునిగిన సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయిన సంఘటనలు ఈ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. బియ్యం వ్యాపారుల వద్ద, చికెన్ షాపుల వద్ద సరకులను బలవంతంగా తీసుకువెళ్లిపోయిన ఘటనలో కూడా కొందరు పోలీసులు సస్పెండ్ కావడం, క్రమశిక్షణా చర్యలకు గురైన వారు కూడా ఉన్నారు. గత ఏడాది జరిగిన కోళ్ల దొంగతనం కేసులో క్రైం పోలీసులు ఒక వ్యక్తిని గాయపరిచిన ఘటనలో ఆ విభాగానికి చెందిన ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు. ఇటీవల రెడ్డిపల్లి జగనన్న లేఅవుట్‌లో ఇనుము దొంగతనం జరిగిన ఘటనలో నిందితులకు సహాయం చేయడంతో పాటు మరికొన్ని ఆరోపణలతో ఇటీవలే మరో ఎస్సై కూడా సస్పెండ్ అయ్యారు. ఇక్కడ జరుగుతున్న దొంగతనాలను స్థానిక పోలీసులు రాజీలు చేసి, కేసులు నమోదు చేయకుండా విడిచిపెట్టేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలు

రెండేళ్లలో పట్టపగలు జరిగిన వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత ఏడాది గంధవరం, విలాస్‌ఖాన్‌పాలెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురయ్యాయి. వీటితో పాటు పద్మనాభం ఆంజనేయస్వామి, గణపతి ఆలయాల్లో, కృష్ణాపురం, పాండ్రంగి ఆలయాల్లో చోరీలు జరిగాయి. మద్ది, పాండ్రంగి చిరత రోడ్డు వద్ద మహిళల మెడల్లో పుస్తెల తాళ్లు తెంపుకెళ్లిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. 2023 జూన్ 30న పద్మనాభ జంక్షన్‌లో పోలీసు స్టేషనుకు కూతవేటు దూరంలో ఆగంతకుడు ఒకడు బైక్‌ను దర్జాగా దొంగిలించుకుపోయాడు.ఈ ఘటన అనంతరం పోలీసు స్టేషనుకు వంద మీటర్ల దూరంలో మరో ఆగంతకుడు మహిళ మెడలో పుస్తెల తాడు తెంచుకు వెళ్లిపోయాడు. గత ఏడాది ఆగస్టులో మరో అగంతకుడు పట్టపగలు ఒక వ్యాపారి బైక్‌పై ఉన్న సిగరెట్ల బాక్సులను దర్జాగా తీసుకువెళ్లిపోయాడు. ఈవిధంగా వరుస దొంగతనాలు జరుగుతున్నా నివారించడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. స్టేషన్‌లో శాంతి భద్రతల విభాగంతోపాటు, క్రైం విభాగానికి వేర్వేరుగా సిబ్బంది ఉన్నారు. అయినా దొంగలు బరితెగించి పట్టపగలు కూడా చోరీలు చేస్తున్నా పోలీసులకు పట్టడం లేదు.

తగరపువలసలో ముత్తంశెట్టి ప్రచారం



1వ వార్డు ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస, మార్చి 22 : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లోని సంతపేట, కొత్తపేట, సంగివలస, వలందపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లోని దేవాలయాలకు వెళ్లి పూజలు జరిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించి, ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రసాద్, సరళారాణి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

జీవీఎంసీ రెండవ వార్డు మామిడిపాలెంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ అభయం పథకం గురించి వివరించారు. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మత్స్యకార విభాగం చైర్మన్ కె. జగన్నాథం, నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వెలగపూడి

ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం : వెలగపూడి

ఆరిలోవ, మార్చి 22 : ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం అని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం 11వ వార్డు ముస్తాఫా కాలనీలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్చుతరావు. 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, ముగడ రాజారావు, గాడి సత్యం, మోది అప్పారావు, ఖలీషా, అహమ్మద్, పేపరు నాయడు, బోయి శ్రీను, లింగం సత్యన్నారాయణ, సూర్యనారాయణ, జగన్నాథం పాల్గొన్నారు.

జీవీఎంసీ సామాజిక మాధ్యమం ప్రకటనలో సీఎం, మేయర్ ఫొటోలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకోజీపాలెం, మార్చి 22 : ఆస్తి పన్ను వసూలుకు సంబంధించి జీవీఎంసీ సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి జగన్, మేయర్ హరి వెంకటకుమారి ఫొటోలను అధికారులు తొలగించారు. జీవీఎంసీ ఉద్యోగులకు ఎన్నికల నియమావళి పట్టదా ?' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఈమేరకు ఈనెల 14న (ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు) జీవీఎంసీ సోషల్ మీడియా ద్వారా ఆస్తి పన్ను వసూలుకు సంబంధించి ప్రజా అవగాహన కోసం విడుదల చేసిన ప్రకటనలో ఉన్న ముఖ్యమంత్రి, మేయర్ ఫొటోలను తొలగించారు.

'సమాజంలో అసమానతలను రూపు మాపాలి'

వెంకోజీపాలెం, మార్చి 22 : సమాజంలో అసమానతలను రూపుమాపాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్యూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును (అండర్ స్టాండింగ్ సోషల్ ఎక్స్‌క్యూజన్ ఇన్ ఇండియా-ఎమర్జింగ్ చాలెంజెస్ ఇన్ సోషల్ ఇంక్లూజన్) శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కులం ఆధారంగా జరిగే అసమానతలు సమాజంలో పలు సమస్యలకు దారి తీస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి. కృష్ణమోహన్, ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

పద్మనాభం, మార్చి 23 : మండలంలోని పలు గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో స్థానిక పోలీసులు శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అనువైన వాతావరణం కల్పిస్తూ ఓటర్లకు భరోసా ఇవ్వడానికి కార్యక్రమాన్ని చేపట్టారు.అయినాడ, బీఆర్ తాళ్లవలస, కోరాడ, గెద్దపేట, తునివలస, మద్ది, పొట్నూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్సై సురేష్ పాల్గొన్నారు. కాగా ఓటర్లను చైతన్య పరిచే స్వీప్ కార్యక్రమాన్ని తునివలసలో నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ఓటింగు శాతం తక్కువగా ఉన్న ఈ గ్రామంలో ఓటర్లకు అవగాహన కల్పించడానికి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరావు, ఎంపీడీఓ శైలజ, ఆర్ఐ కోటి, పాల్గొన్నారు.

మద్దిలపాలెం : మద్దిలపాలెం వీధుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. మద్దిలపాలెం, చైతన్య నగర్, కేఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో లాఠీలు, తుపాకీలతో ర్యాలీగా సాగారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు భరోసా కల్పించారు.

డ్రగ్ రాకెట్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిపురం, మార్చి 22 : డ్రగ్ రాకెట్‌పై కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.

ఐదో వార్డు ఓటర్లకు ఏడో వార్డులో పోలింగ్ బూత్

మధురవాడ, మార్చి 22 : జీవీఎంసీ 5వ వార్డుకు చెందిన కొన్ని ప్రాంతాల ఓటర్లకు 7వ వార్డు పరిధిలోని పోలింగ్ బూత్‌లు కేటాయించారు. ఎన్నికల నిబంధనలు ప్రకారం ఓటరు ఉండే ప్రాంతానికి రెండు కిలోమీటర్లలోపే పోలింగ్ కేంద్రం కేటాయించాలి. కానీ అందుకు భిన్నంగా 5వ వార్డులోని కొన్ని ప్రాంతాల ఓటర్లు మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి ఓటేయాల్సి పరిస్థితి ఏర్పడింది. వార్డులోని శివశక్తి నగర్, శ్రీలక్ష్మీనగర్, సద్గురుసాయినాథ్ కాలనీ ప్రాంతాల్లో సుమారు 2377 మందికి పైగా ఓటర్లకు 7వ వార్డులోని మల్లయ్యపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 326, 327 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. మూడేళ్ల కిందట జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ ఓటర్లు శివశక్తినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో వారందరికీ మల్లయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో కేంద్రాన్ని కేటాయించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు అంత దూరం వెళ్లి ఓటు ఎలా వేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి 5వ వార్డు ఓటర్లకు ఆ పరిధిలోనే బూత్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పైడితల్లమ్మకు సామూహిక కుంకుమ పూజ



సామూహిక కుంకుమ పూజలో మహిళలు

ఆరిలోవ, మార్చి 22 : పాత డెయిరీ ఫారం ఆదర్శనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పైడిమాంబ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. వేద పండితులు ముందుగా అమ్మవారికి పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం వందలాది మంది మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు



మాట్లాడుతున్న విజయ్‌రామ్

సింహాచలం, మార్చి 22 : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని ప్రకృతి వ్యవసాయదారులు, వినియోగదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌రామ్ అన్నారు. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయదారులు, ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నృసింహవనంలో ఏర్పాటు చేసిన శబల భోజనాల పండుగలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులతో పండించిన పంటలు వల్ల అనేక రుగ్మతలు వస్తా యని, అటువంటి అనారోగ్య పరిస్థితుల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి ప్రకృతి ఆధారిత వ్యవసాయోత్పత్తులను వినియోగించడం ఒక్కటే శ్రేయస్కరమని చెప్పారు. దేవదాయశాఖ అదనపు కమిషనర్, అన్నవరం దేవస్థానం ఈఓ కోడూరి రామచంద్రమోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం విస్తృత పరచాల్సి ఉందన్నారు. అనంతరం శబల భోజనాల పండుగలో భాగంగా పలు చిరు ధాన్యాలతో, దేశీయంగా సేంద్రియ ఉత్పత్తులతో పండిన బియ్యంతో వంటలు వండి ఆహూతులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమిదే విజయం : పట్టాభిరాం

ఎంవీపీ కాలనీ, మార్చి 22 : వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిదే విజయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం అన్నారు. ఎంవీపీ కాలనీ పన్నెండో సెక్టరులో శుక్రవారం ఆయన తన బృందంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా వెలగపూడిని నాలుగోసారి, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, రాజు, బాపిరాజు, నరేంద్ర, వాసు, శివ, కళావతి, వరలక్ష్మి, దుర్గ, ఈశ్వరరావు పాల్గొన్నారు.


దేశ భవితను మార్చే శక్తి యువత సొంతం : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 22 : దేశ భవితను మార్చే శక్తి యువతకు ఉందని ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తరువాత వాస్తవిక సమాజం విసిరే సవాళ్లకు సిద్ధం కావాలని చెప్పారు. కొన్ని సందర్భాల్లో అపజయాలు ఎదురవుతాయని, వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. చేసే పనిపై ఏకాగ్రత కలిగి ఉండడం, కష్టించే తత్వం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌరీ పూర్ణిమ పూజ

ఎంవీపీ కాలనీ, మార్చి 22 : ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ మైదానంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం గౌరీ పూర్ణిమ పూజ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి శ్రీయదురాజ దాస ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాయంత్రం 6 నుంచి జరిగే ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అమ్మవార్లకు వెండి కవచాలు బహూకరణ



వెండి కవచాలతో దాతలు

సాగర్‌నగర్, మార్చి 22 : రుషికొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న అమ్మవార్లకు నగరానికి చెందిన ఆరుగురు స్నేహితులు రూ.20 లక్షల విలువైన ఆభరణాలను శుక్రవారం బహూకరిం చారు. గోదాదేవి, పద్మావతి అమ్మవార్లకు, ఆంజనేయస్వామికి వెండి కవచాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దాతలు చెక్క శ్రీరామ్మూర్తి, తాతబాబు, శేష గిరిధర్, మృత్యుంజయరావు, రాంజీ, భవానీ ప్రసాద్, గణేష్, ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు, ఇన్‌స్పెక్టర్లు శివ, కిశోర్,పాల్గొన్నారు.

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

సాగర్‌నగర్, మార్చి 22 : యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) డైరెక్టర్ డాక్టర్ సురేష్ చంద్ర పాండే అన్నారు. శుక్రవారం రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజి, ఇంజనీరింగ్, తదితర కోర్సుల కళాశాల 14వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొని కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో జీవీపీ డైరెక్టర్ ఆచార్య శర్మ, ప్రిన్సిపాల్ ఎస్. రజని, వినయ్, ప్రసాద్, ప్రగడ రాజగణపతి, తదితరులు పాల్గొన్నారు.



జల దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, ట్రైనీ టీచర్లు

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

భీమునిపట్నం, మార్చి 22 : జీవరాశి మనుగడ నీటిపై ఆధారపడి ఉందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తెరిగి నీటిని పొదుపుగా వాడాలని డైట్ కళాశాల అధ్యాపకుడు గొట్టేటి రవి అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి విలువ తెలుసుకుని అందరూ నడుచుకోవాలని, లేకపోతే జీవరాశి వినాశనం తప్పదన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు సేవ్ వాటర్ ఫ్లకార్డులు పట్టుకుని జల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం. మహాలక్ష్మి, సోమయాజులు, సారిపల్లి త్రినాథరావు, పేట హరిణి పాల్గొన్నారు.

ఇస్కఫ్ ఆధ్వర్యంలో...

సిరిపురం : జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్)ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఏయూ ప్రొఫెసర్ రాజమాణిక్య, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి మాట్లాడుతూ 2040 నాటికి ప్రపంచంలో భూగర్భ జలాలు చాలా వరకు తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న తరుణంలో జలాలను సక్రమంగా వినియోగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. చెరువులు, రిజర్వాయర్లు, మంచినీటి బావులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ నగర నాయకులు సుకుమారన్, ప్రభాకర్, రామప్రభు, ఎం. మధుమతి, పావని, సత్యవతి, అప్పలరాజు, శ్యామ్‌సుందర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే లక్ష్య సాధన సాధ్యం



కేజీబీవీ సిబ్బందితో సీబీఐ అధికారి నాగవల్లి శివ

భీమునిపట్నం, మార్చి 22 : విద్యార్థులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగితే తప్పకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని సీబీఐ అధికారి నాగవల్లి శివ అన్నారు.శుక్రవారం ఆయన పట్టణంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. సీమేట్ బాబూరావు మాట్లాడుతూ బాలికలు ఒత్తిడికి గురవ్వకుండా ఇష్టంగా ఎలా చదవాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం, మార్చి 22 : పట్టణంలోని కృష్ణాకాలనీ వెంకటగిరిపై ఉన్న పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుదర్శన హోమం నిర్వహించారు. ఐదు నుంచి సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు, నిత్య హోమాలు జరిగాయి. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. రాత్రి దీపోత్సవం జరిపారు. ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు ఆదిమూలం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ధనాలకోటి చందు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యానందరావు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, ఆలయ సంక్షేమ సంఘం నాయకులు కె. ముత్యాలరావు, సన్నిబాబు, శంకర్, శ్రీను, అప్పన్న, హరి పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు మేలు'

మద్దిలపాలెం, మార్చి 22 : జీవీఎంసీ 22వ వార్డులో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. అలాగే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, పెనల శ్రీను, కోడి బోయిన ఆనంద్, పడగల డేవిడ్, రాజ్‌కుమార్, రవి, మిల్లు రాజు, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంకేతిక ప్రదర్శనలు

సాగర్‌నగర్, మార్చి 22 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈటీఈ) సంయుక్త నిర్వహణలో జరుగుతున్న జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం (ఐస్ప్యేర్ ఆర్ - 2024) లో భాగంగా శుక్రవారం టెక్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆలోచనలకు వేదికగా టెక్ ఎక్స్ పో విశేషంగా ఆకట్టుకుంది.సెక్యూరిటీ అంశాలతో పాటు పంట పొలాలపై పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను ప్రదర్శనలో ఉంచారు. అలాగే ఆటోమొబైల్ పరిశ్రమలకు ఉపయోగపడే రీజనరేటివ్ బ్రేకింగ్ పరిజ్ఞానం, మిద్దె పంటలు, ఇస్రో రాకెట్, గార్డెనింగ్‌ను ఐఓటీ సహాయంతో ఏవిధంగా పర్యవేక్షించవచ్చు వంటి నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, ఈఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి. భరణి చంద్రకుమార్, ఐస్ప్యేర్ ఆర్ కన్వీనర్ బి. సెవెన్త్‌లైన్, ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ పి. రాజు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన

ఎండాడ, మార్చి 22 : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్)లో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె. బాబుజీ, విశాఖ టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ ఫణీంద్రబాబు, విశాఖ ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. సునీల్‌కుమార్, జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో టీబీ ఒకటని, దీనివల్ల ఏటా 1.6 మిలియన్ల మంది మరణిస్తున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ టీబీ పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జిమ్సర్ శ్వాసకోశ వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ సాంబశివరావు, జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్పీ రావు,సూపరింటెండెంట్ డాక్టర్ రామాంజనేయులు, వైద్యులు నిఖిల, వెంకటేశ్వరరావు, జి. ఇందిరా, అప్పలరాజు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన అమెరికా నావికా దళం

వెంకోజీపాలెం, మార్చి 22 : ఏయూను అమెరికా నావికా దళ బృందం శుక్రవారం సందర్శించింది. ముందుగా వారు వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో పరిపాలనా భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూలో క్రీడలు, యోగా, సైకాలజీ, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ వంటి వైవిధ్యత కలిగిన విభాగాలు ఉన్నాయన్నారు. దేశంలో రక్షణ రంగాలకు విద్యాపరంగా సేవలందిస్తున్న వర్సిటీగా ఏయూ పేరుగాంచిందని చెప్పారు. ప్రస్తుతం భారతదేశంలో త్రివిధ దళాల ఉద్యోగులకు ఉన్నత విద్యను చేరువ చేసే దిశగా పని చేస్తున్నామని, భవిష్యత్తులో విదేశీ సైనికులకు కూడా ఉన్నత విద్య అవకాశాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అమెరికా నావికా దళం కమాండింగ్ అధికారి మిచెల్ సి. బ్రాండ్ మాట్లాడుతూ సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖ తమకు ఎంతో నచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.